
# నవమిపండుగ

గుండం రామచంద్రారెడ్డి

మద్రాసు నుంచి ముంబయ్‌కి వెళ్లే మెయిల్ మరో అరగంటలో కమలాపురం రైల్వే స్టేషన్‌కు రాబోతోంది. ముంబైకెళ్లేది ఒకరే అయినా అతని కోసం పాతిక మంది పైనే స్టేషనుకొచ్చారు. దేశం గాని దేశం. అక్కడెట్లా వుంటుందోనన్న భయం అతని భార్య మనసులో నాటుకుపోయింది. అయిన వాళ్లందర్నీ కాదని పరాయి దేశం వెళుతున్నానన్న బాధ అతడిలో సుడులు తిరుగుతోంది కానీ, బాగుపడే కాలం వచ్చిందనీ, అప్పులు తీరి నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చన్న ఆశే ఆ బాధను వెనక్కు నెట్టింది. తెల్లార్లూ బొంబాయి ప్రయాణంలో అరబ్ షేక్‌ల అత్తరు సెంట్లూ, ఖర్జూరాల ఘుమ ఘుమ



లను మదిలో మెదిలించుకోవడంతో ఒంటరి ప్రయాణమన్న ఆలోచనను దూరం చేసింది. అప్పులన్నీ తీర్చి, ఊర్లో రైతులందరి సరసనా ధీటుగా నిలబడుతున్నా నన్న నమ్మకం కువైట్ ప్రయాణానికి మరింత ధైర్యాన్నిచ్చింది. కలలు కంటూండగనే దాదర్ స్టేషన్ రానే వచ్చింది.

* * *

ఎన్ని పెద్ద పండుగలొచ్చినా వెంకటేసుకు మాత్రం శ్రీరామనవమే పెద్ద పండుగ. పెసరపప్పు, కొబ్బరి ముక్కలపై చక్కెరజల్లి ఊరందరి పిల్లలకు పంచుతుంటాడు ఆరోజు. అందరికీ తలో గ్లాసు పానకం కలిపి ఇస్తూ వుంటే వెంకటేసు మనసు పులకిస్తూంటుంది.

రాత్రికి రాములోరి గుడిదగ్గర భజన ఏర్పాటు చేస్తే, సరి ఈడు మగపిల్లలంతా వచ్చి భజన చేస్తూవుంటే అతని ఆనందం చెప్పలేనంత. అప్పుడే మిత్రుడు కరిముల్లా ఇట్లాంటి సమయంలో వుంటే ఎంత సంతోషపడిండునో అనుకునేవాడు. వెంకటేసు, కరిముల్లా మంచి స్నేహితులు. ఒకే మంచంలో తిని ఒకటే మంచంలో పడుకుండేటోల్లు. పరిస్థితులు బాగా లేక వాడు కువైట్ పోయాడు. ఇద్దరూ కలిసి ఏడుదాకా వూళ్ళోని హైస్కూల్లోనే చదివారు. ఆరోజు రాత్రి తెల్లవార్జులూ భజన చేసి తెల్లవారుఝామున మూడున్నరకు వెళ్లి పడుకున్న వెంకటేసు పదివరకూ లెగలే. పదకొండు గంటలకు పోస్ట్‌మాన్ సుధాకరొచ్చి "సావిత్రమ్మా! వెంకటేసు పేరుమీద ఉత్తరమొచ్చిందమ్మా" అంటూ వెంకటేసు భార్యతో చెప్పడం వినపడుతూండగానే వెంకటేసు చివుక్కున లేచి చూసినాడు.

ఆదరా బాదరా జాబు చించి చదవడం మొదలుపెట్టినాడు.

"మిత్రుడు వెంకటేసుకు కరిముల్లా వ్రాయునది. నీకు ఇదివరకే పాస్‌పోర్టు రెడీ చేసుకొమ్మని చెప్పాను. ఒక నెలలో విసా రెడీ అవుతుంది. ఈలోగా డబ్బులు కూడా చూసుకుని నా దగ్గరకి వచ్చెయ్యి. పండీ పండని పది కయ్యల్లో నువ్వు ఎప్పుడూ పెద్దోడివి కాలేవు" అంటూ కరిముల్లా రాసిన ఉత్తరం చదవగానే వెంటకేసు మొహంలో బీదరికం మాయమై వెలుగు కనిపించింది.

వెంకటేసుకు పెళ్ళయి మూడేళ్ళయింది. ఒక మగబిడ్డ కూడా. ఉత్తరం తీసుకుని నేరుగా తండ్రి దగ్గరికెళ్ళాడు. "నాయనా! కరింగాడు ఉత్తరం రాశాడు.

నన్ను కువైట్‌కు రమ్మని. అరవై వేలదాకా ఖర్చవుతుందిట. ఇంతకంటే మంచికాలం రాదు. ఎట్టాగైనా నేను కువైట్‌కు వెళ్లి మన అప్పులు తీర్చి అంతో ఇంతో చేతపట్టుకుని వస్తా'' అంటూ చెప్పాడు.

తండ్రికి కువైట్ అంటే భయం. కేవలం కరిముల్లా వున్నాడన్న నమ్మకంతోనే పంపడానికి ఒప్పుకున్నాడు. వీడికి ఏ కష్టమొచ్చినా పెద్దదిక్కుగా వుంటాడని అని మనసులో అనుకున్నాడు.

ఊర్లో అందిన చోటల్లా అప్పు తీసుకొచ్చారు. రెండ్రూపాయలకు కొంత, మూడ్రూపాయలకు మరికొంత వడ్డీకి తెచ్చారు.

* * *

ఆరోజు శుక్రవారం ఉదయం పదిగంటలకు రిజిస్టర్ పోస్టులో వీసా వచ్చింది. అందరూ శుక్రవారం లక్ష్మీదేవి వచ్చినట్టుందని వాళ్ల ఆనందం అలివికాలేదు. ఆ రాత్రికే అందరూ కరిముల్లాకు ఫోన్ చెయ్యడానికి వెంకటేసు కుటుంబమంతా బయలుదేరింది. ''కరిముల్లా! నువ్వు పంపిన వీసా చేరింది. నువ్వు ఎప్పుడు విమానం టిక్కెట్టు బుక్ చేసుకోమంటే అప్పుడే చేసుకుంటా'' అన్నాడు వెంకటేసు.

''ఈనెలాకరుకల్లా చేసుకో. విమానం ఎక్కే ముందు బొంబాయినుంచి నాకు ఫోన్ చెయ్యి. ఎయిర్‌పోర్టుకొచ్చి నిన్ను తీసుకెళతా'' అంటూ కరిముల్లా చెబుతూంటే వెంకటేసు కళ్లల్లోంచి ఆనంద భాష్పాలు రాలుతున్నాయి.

ప్రయాణం దగ్గర పడింది. ఇంట్లో అందరూ ఆనందంగా వున్నా, భార్యకు మాత్రం బీదకూడు తిన్నా మొగుడు కళ్ళముందరుంటేనే మంచిదనుకుంటోంది. అయినా తప్పదని తనకూ తెలుసు. వద్దన్నా ఎవరూ ఒప్పుకోరు.

ఆరోజు వెంకటేసు బొంబాయికి బయలుదేరాలి. బొంబాయి మెయిలుకు టికెట్లు రిజర్వేషను వారం కిందటే జరిగింది. రైల్వే స్టేషన్‌కు కుటుంబంతో పాటు బంధువులూ వచ్చారు. అందరూ ఒకటే ఏడుపు. భార్య కొడుకునెత్తుకుని పైటకొంగు కళ్లకడ్డం పెట్టుకుని లోలోపల కుమిలి కుమిలి ఏడుస్తోంది.

* * *

దాదార్ రైల్వే స్టేషన్‌లో దిగిన వెంకటేసు చీమలున్నట్టున్న జనాల్ను చూసి బిత్తరపోయాడు. తనకు తోడుగా వచ్చిన షేక్‌బాష వెంకటేసును టెలిఫోన్ బూతు దగ్గరకి తీసుకెళ్లాడు. అక్కడినుంచి కరిముల్లాకు ఫోను కలిపితే వెంటనే కరిముల్లా అందుబాటులో వున్నాడు. ''నేనేరా వెంకటేసు, చెప్పు అన్నాడు''

''మంగళవారం సాయంత్రం ఉదయం ఏడుగంటలకు విమానం టిక్కెట్టు దొరికింది. ఇదే నీకు ఫోన్ చెయ్యడం'' అన్నాడు.

''సరే నేనొచ్చి నిన్ను ఎయిర్‌పోర్టునుంచి తీసుకెళ్తా నువ్వేం భయపడకు'' అన్నాడు కరిముల్లా.

అటు ఇటుగా నల్చుకున్నట్టు వుంది. వెంకటేసు చాలా ఇబ్బంది పడతాండాడు. ఎప్పుడూ కాటన్ లుంగీలు వేసుకునేవాడు ఒక్కసారిగా ప్యాంటులు వేసుకునేసరికి ఒత్తుకున్నట్టు అనిపిస్తోంది. మంగళవారం ఉదయం రానే వచ్చింది. విమానమెక్కితే స్వర్గమున్నట్టుంది. అందరూ సూటు బూటు గాళ్లే. మన పల్లెటూరోళ్లు ఒక్కడు కూడా లేడు విమానంలో అని మనసులో అనుకున్నాడు.


పక్కసీటులో ఎవడో బొంబాయోడు. వాడికి తెలుగు రాదు, వెంకటేసుకు హిందీరాదు. విమానం దిగేదాకా వాళ్లిద్దరూ మాట్లాడింటే ఒట్టు. విమానంలో గంటకోసారి కాఫీలు, టిఫిన్లు, చాక్లెట్లు తెచ్చిస్తోంటే కువైట్‌లో కూడా ఇట్నే వుంటుందనుకుని వెంకటేసు మురిసిపోతాండాడు.

* * *

దిక్కులు చూస్తున్న వెంకటేసును పేరుతో గట్టిగా పిలిచాడు కరిముల్లా. కరింగాడ్ని చూడగానే వెంకటేసుకు ప్రాణం లేచొచ్చింది. ఇద్దరూ ఒకరికొకరు గట్టిగా కావలించుకున్నారు.

''ఏరా వెంకటేసూ! విమానం ఎట్లుంది? కొత్తగదా'' అని కరిముల్లా అడిగాడు.

''ఏందోరా.. దాంట్లో కూర్చునింటే నాకేందో ఎక్కడికో పోయినట్టుంది. ఎవడు కనిపెట్టాడోగానీ నిజంగానే చాలా కొత్తగా అనిపించింది'' అంటూ



విమానం గురించి ప్రాణమంతా బిగబట్టి చెబుతున్నాడు వెంకటేసు.

కపిల్‌గాని జీపొకటి వేసుకుని వచ్చి దాంట్లో నేరుగా కరిముల్లా రూముకే తీసుకుపోయాడు. ఊరంతా కొత్త. జీపులోంచే దిక్కులు చూస్తున్నాడు. ఎక్కడ చూసినా పెద్ద బిల్డింగులే కానీ, నాలుగు కొమ్మలుండే చెట్టే కనిపించలా. ''ఏరా కరిముల్లా! ఇక్కడ ఊళ్లో చెట్లుండవా? అడవుల్లోనేనా వుండేది'' అని కరింగాడ్ని మొదటి డౌటు అడిగాడు.

''ఇక్కడ ఊళ్లోనే గాదు అడవుల్లో అసలుకే వుండవురా. వూరు దాటుకుంటే అంతా ఎడారే. అంటే ఇసుక తప్ప మట్టికూడా కనిపించదు'' అనేటప్పటికి వెంకటేసు లోలోపల్నే 'చెట్టులేని ఊర్లో మనసుల్లేని మనుషులుంటారని వాళ్ల తాత ఎప్పుడో చెప్పిన మాటలు ఇప్పుడు గుర్తొచ్చి కొంచెం వళ్లు జలదరించింది.

అయినా మనం టౌన్లో వుండేవాల్లం, మనకు చెట్లతో ఏం పనిలే అనుకున్నాడు.

కరిముల్లా చేసిన చపాతీలోకి ఉర్లగడ్డ తాలింపు తిని గంటసేపు కువైట్ సంగతుల గురించి మాట్లాడుకున్నారు.

''వెంకటేసూ! ఈ రాజ్యంలో ఏ పిల్లపైపైనా కళ్లెత్తి చూస్తే ఈ నాకొడుకులు ఏమైనా చేస్తారు. వాళ్ళ పిల్లలు ఏం చేసినా చెల్లుబాటే. మనకు అలా కాదు. మన పని మనం చేసుకుని మన ఇంటికి పోవాలి. పొరపాటు జరిగితే అదే మొదటిది అదే చివరిది కూడా'' అన్నాడు కరిముల్లా.

పొద్దున పదకొండు గంటలకు వెంకటేసును కపిల్ దగ్గరకు తీసుకెళ్లి చూపించాడు కరిముల్లా. కపిల్‌గాన్ని చూడగానే వెంకటేసుకు దూదేకుల సత్రం దస్తగిరి గుర్తొచ్చాడు. చంపలపైకి నెత్తి కత్తిరిచ్చి, మేకపోతు మాదిరి గడ్డం పెంచి వున్నాడు. పైనుంచి కిందిదాకా ఒకటే చొక్కాలో కనపడిన ఆ సేటును చూస్తానే వెంకటేసు కొంచెం భయపడ్డాడు.

వెంకటేసును చూసి కరిముల్లాతో ''వీన్ని నీదగ్గరే వుంచుకో. సాయంత్రం వచ్చి పని చెబుతా'' అంటూ సేటు అరబ్బులో చెప్పాడు.

కరిముల్లా సేటు కూరగాయలంగట్లోనే పని చేస్తున్నాడు ఈ రెండేండ్ల నుంచి. విసా ఇచ్చేటప్పుడుకూడా నీకు తోడుకోసమే నీవోన్ని తెప్పిచ్చేదని చెప్పాడు. ఇద్దరం కలిసి ఒపిగ్గా పన్జేసుకోవచ్చని అనుకున్నాడు కరిముల్లా.

***

సాయంత్రం ఆరుగంటలకు జీపులో దుమ్ములేపుకుంటూ వచ్చాడు కపిల్.. కరిముల్లా రూముదగ్గరికి. రేపు పొద్దున్నే ఏడుగంట్లకల్లా పనిలోకి వెళ్ళమని చెప్పాడు. పని ఎక్కడైంది చెప్పగానే కరిముల్లా గుండెలు నీల్లయినయి. అరబ్బు రాని వెంకటేసు మాత్రం అలాగే చూస్తూ వున్నాడు.

''సేటూ! నా దగ్గర్నే పని..'' అని నసిగాడు.

''చెప్పింది చెయ్. లేదంటే నువ్వుకూడా ఇండియాకు వెళ్తావ్'' అంటూ కండ్లెర్ర చేశాడు సేటు.

వూరికి డెబ్బై కిలోమీటర్ల దూరంలో కర్జూరం చెట్లకు నీరు పారగట్టడం, ఒంటెలను కాయడం



వెంకటేసుకు అప్పజెప్పిన పని. ముప్పై కిలోమీటర్ల దూరంలో మనిషి కూడా కనిపించదు. చిన్న షెడ్డు ఒకటి వేశారు. దాంట్లో వెంకటేసు వుండాలి. ఒక బస్తా గోధుమపిండి, ఓ బస్తా రాగుల పిండి అక్కడపడేసి వస్తారు. దాన్ని వండుకోవడం, ఆ ఒంటెలను కాయడం పని.

నెలకు ఇండియా లెక్కలో ఎనిమిది వేల రూపాయలు జీతం.

వెంకటేసుకు పనిగురించి ఎట్లా జెప్పాలో అర్థం గాలే. కరిముల్లా మనసులో కుమిలిపోతున్నాడు. చెప్పక తప్పదు.

''వెంకటేసూ! ఎడారిలో పనిచెయ్యాలంట. నా దగ్గర్నే కదా పని అని అడిగాను. కాదు అక్కడే చెయ్యాలి. లేదంటే ఇద్దరూ ఇంటికెళతారు అంటున్నాడు. నువ్వే ఆలోచించు. నన్ను సేటుగాడు మోసం చేశాడు'' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు కరిముల్లా.

వెనక్కు వెళ్లిపోయేదానికి వెంకటేసుకు రెండ్రూపాయలు, మూడ్రూపాయలతో తెచ్చిన అరవై వేల అప్పు సినిమా తెరపై కనిపించినట్టు కనిపించింది.

''నువ్వేమీ బాధపడకు కరీం. అప్పు తీరేవరకూ పనిచేస్త. తరువాత ఓపికుంటే చేస్తా, లేదంటే ఇండియాకు వెళ్తా'' అంటూ పనిలోకి వెళ్ళేందుకు సిద్ధపడ్డాడు వెంకటేసు.

సేటు మనిషొకడు వచ్చి జీపులో వదిలిపెట్టి వచ్చాడు. అంతకు ముందు పన్జేసే వాడు చెయ్యలేక రెండ్రోజుల యింది మానుకుని.

వెంకటేసు ఎడారిలో దిగుతానే ఏం చెయ్యాలో ఏమీ అర్థం కాలె. మనుషుల్లేరు. చెట్లు లేవు. అన్నీ ఒంటెలే. చిగురొచ్చే చెట్లను చిగురొచ్చినట్లే తినేస్తున్నాయి అవి కూడా. ఎక్కడోగాని వేలెడెత్తు చెట్టు కనిపించలేదు.

ఒంటెలు కాయడానికో కంచరగాడిదనిచ్చారు. దానిమీద ఎక్కి వాటిని కాయాల. ఒక్క నెల పనిచేశాడు. అప్పు అక్కడే తీర్చుకుందామంటే వెనక్కిపోయేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఎవరూ లేరు కాబట్టి అరబ్బు భాష కూడా తెలియడం లేదు.

నెలకోసారొచ్చి సేటు మనిషి తిండిగింజలు వేసి వెళ్తున్నాడు. వానితో ఎంత జెప్పినా వానికేమీ అర్థం కాదు.

ఒకసారి వాని జీపు ఎక్కాడు నేనూ వస్తానని.

## చిట్కాల పందిరి

- వేపాకును బాగా పులిసిన పెరుగుతో నూరి తలపై మాడుకు బాగా పెట్టండి. రెండు గంటల తర్వాత తల స్నానం చేయండి. ఇలా వారానికి ఒక్కసారి చొప్పున మూడు నెలలు చేస్తే చుండ్రు బాధనుంచి విముక్తి అవుతారు.
- ధనియాల కషాయం లేక పాలలో ధనియాల పొడి వేసుకొని రోజూ ఒక పూట తాగండి. పంచదారకు బదులు పటిక బెల్లం వాడండి. ఇది కాక అన్ని కూరల్లో చట్నీల్లో కొత్తిమీర అధికంగా వాడితే కొలెస్టరాల్ తగ్గుతుంది.
- ప్రతిరోజూ ఉదయం బాగా పండిన టమాటా ముక్కలను నాల్గింటిని ముక్కలుగా కోసి వాటిపై నిమ్మరసం పిండుకొని బ్రేక్‌ఫాస్ట్ చేయండి. ఇలా రెండు నెలల పాటు చేస్తే స్థూలకాయం తగ్గుతుంది.
- పగిలిన పెదాలు మంటగా ఉంటే రోజుకు నాలుగైదు సార్లు వెన్న రాయండి. గులాబీలను పాలతో మెత్తగా నూరి రాత్రిపడుకోబోయే ముందు పెదాలకు పట్టిస్తే పెదాల పగుళ్లు పోతాయి.
- ఆపిల్ పైతొక్కతో ఇత్తడి పాత్రలు తోమితే అవి కొత్త వాటిలా మెరుస్తాయి.

– కె.ఎస్.పి.లక్ష్మి

వాడు మాత్రం "నిన్ను ఇక్కడకు తెచ్చింది వెనక్కి పంపడానికి కాదు" అంటూ అరబ్బులోనే మాట్లాడి చంపకేసి పీకి దించి వెళ్లిపోయాడు.

ఏడాది కావస్తోంది. ఇంటిదగ్గరనుంచి జాబు లేదు. వెంకటేసుకు రాసేందుకు అవకాశమే లేదు. పిలిపిచ్చుకున్నోడు పత్తాలేడు.

* * *

కరిముల్లా మనసు మనసులో లేదు. కూరగాయలంగట్లో పనిచేసే మాటేగాని మనసంతా వెంకటేసు పైనే. ఎప్పుడు పోదామన్నా సేటు వెళ్ళనివ్వడు. కూరగాయలంగడి. ఖాతాలు దెబ్బతింటాయని చెబుతాడు. శుక్రవారం సెలవొస్తే ఇంటిపని చెయ్యాల. వాని పిల్లోల్లందరినీ జీపులో తిప్పాల.

వెంకటేసుకు జరిగిన మోసానికి బాధ్యత నెత్తికెత్తుకున్నాడు కరిముల్లా. సావిత్రమ్మకు మాత్రం ఇరవై రోజులకు ఒక ఉత్తరం వెంకటేసు రాసినట్టే రాస్తున్నాడు. కొడుకును నాయన్ను అమ్మను అడిగానని మరీ మరీ రాస్తున్నాడు. భార్యను పలకరించినట్టు రాస్తున్నాడు.

అక్కడ్నుంచి వచ్చిన జాబులు వెంకటేసుకు ఇచ్చేందుకు కూడా అవకాశం లేదు.

వెంకటేసు డబ్బులుకూడా కరీమే ఇప్పించుకుని ఎనిమిదినెల్లకోసారే యాభైవేల్దాకా పంపాడు.

యాభై వేలు రాగానే ఇంటిదగ్గర వెంకటేసు అమ్మ నాయనలకు పట్టపగ్గాల్లేవు. నా కొడుకు పున్నెం చేసుకున్నోడని ఉప్పొంగి పోతున్నారు.

వెంకటేసు ఎట్లున్నాడో కరిముల్లాకు దిగులు పట్టుకుంది. సేటుగాడు ఎంత అడిగినా ఏమీ చెప్పడు. "వానికేమైంది? బాగానే వున్నాడు" అని చెప్పి విసిగించుకుంటున్నాడు.

* * *

వెంకటేసును చూస్తే ఎవరైనా కళ్లకు నీళ్లు పెట్టుకోవాల్సిందే. కండలన్నీ కరిగిపోయాయి. భార్యాపిల్లల మీద గాలి వదులుకున్నాడు. కాని ఒకటి మాత్రం వెంకటేసును రోజూ మర్చిపోనివ్వడం లేదు. అదే నవమి పండుగ.

పండగ ఎప్పుడో తెలియదు. క్యాలండర్లు ఎప్పుడో మర్చిపోయాడు. ఒక రోజు రెండ్రోజులా గుర్తుండేదానికి. ఏరోజు ఏ వారమో అర్థం కావడం లేదు వెంకటేసుకు. ఒంటెలెన్ని వున్నాయో ఎంచుకోవడం తప్ప వారాలు డేట్లు గుర్తులేవు. తప్పిచ్చుకుని వెళ్లేందుకు డెబ్బై కిలోమీటర్లు నడిచి పోవాలె.

కనీసం పండగెప్పుడో తెలియకపాయె రాములోరిని దండం పెట్టుకునేందుకు. 'భగవంతుడా నన్ను కువైట్‌లో బతకనియ్యకుంటే ఫరవాలేదు, కనీసం నా వూళ్ళోనన్నా నన్ను చావనివ్వు సామీ' అంటూ మనసులోనే కుమిలిపోయాడు.

* * *

ఆరోజు శుక్రవారం. పొద్దున్నే ఎనిమిది గంట్లకే సేటుదగ్గరికి వెళ్ళాడు కరిముల్లా. "సేటూ! ఈరోజు వెంకటేసు దగ్గరకి వెళ్ళొస్తా. చాలా రోజులయింది వెళ్లి. మళ్లీ వెంటనే తిరిగి వస్తా" అంటూ ప్రాధేయపడినాడు.

"సాయంత్రం నాలుగ్గంట్లకల్లా రాకపోతే నిన్ను ఇంటికి పంపుతా" అంటూ బెదిరించి పంపాడు

పండగ ఎప్పుడో తెలియదు. క్యాలండర్లు ఎప్పుడో మర్చిపోయాడు. ఒక రోజు రెండ్రోజులా గుర్తుండేదానికి. ఏరోజు ఏ వారమో అర్థం కావడంలేదు వెంకటేసుకు. ఒంటెలెన్ని వున్నాయో ఎంచుకోవడం తప్ప వారాలు డేట్లు గుర్తులేవు. తప్పిచ్చుకుని వెళ్లేందుకు డెబ్బై కిలోమీటర్లు నడిచి పోవాలే.

సేటు.

ఏం తిన్నాడో ఏమోనని కరిముల్లా గోధుమరొట్టెలు కోడిమాంసము తీసుకుని జీపులో బయల్దేరాడు.

* * *

ఎప్పటి మాదిరే తిండిగింజలేసి వెళ్లేందుకు వస్తున్నాడు ఈ సేటు నాకొడుకు. నేనెలాగైనా సచ్చిపోయేవాన్నే. ఈన్ని చంపుతే మాత్రం ఈ ఎడారిలోంచి జనాలుండే జైలుకైనా వెళతా అంటూ ఒంటెలు కాసే మంచి బడితొకటి తీసుకుని షెడ్డు గోడవార నిల్చోనున్నాడు. రయ్యిమంటూ ఇసుక మింద తొక్కులాడుకుంటూ వచ్చి షెడ్డుముందర ఆగింది జీపు.

జీపులోంచి కరిముల్లా దిగుతున్నాడు.

కరింగాడ్ని చూడగానే స్నేహితుడని నమ్మాలో మోసం చేసినందుకు ఏడవాలో అర్థం కాలేదు వెంకటేసుకు. వెంకటేసును చూడగానే కరిముల్లా కళ్లలో నీళ్లు వంక పారినట్టు పారుతున్నాయి. వెంకటేసుకు కళ్లలో నీళ్లు రావడంలేదు. ఏడ్చి ఏడ్చి ఎడారిలో కన్నీళ్లన్నీ ఇంకిపోయి, కనురెప్పల కింద కనుగుడ్లు మాత్రమే మిగిలిపోయాయి.

"వెంకటేసు! ముందు ఈ గోధుమరొట్టె కోడి కూర తిను. నిబ్బరంగా తరువాత మాట్లాడదాం. సొంతకష్టం తెలియదు ఈ వెధవలకు. పెట్రోలును నమ్ముకున్న పింజారీలు వీళ్లు. అత్తరు, పన్నీరుల వాసన తెలుసు గానీ, ఆకలికి అలమటించే మనసులను గుర్తించలేరు. ఈ ముండాకొడుక్కి పదకొండు మంది కొడుకులు పుట్టారు ముగ్గురు భార్యలకు. ఒక్కడూ పనిచేసిందిలేదు. కుటుంబానికంతా ఒక్కళ్ళమే పుట్టిన మనగురించి ఆలోచించలేరు. మనం ఒకరం చెమట చిందిస్తే పదిహేనుమంది తింటారు. మన రాజ్యంలో ఇంత అన్యాయముంటే పక్కింటోడే తంతాడు" అంటూ బ్యాగులోంచి రెండు క్యారేజీలు తీసాడు.

వెంకటేసు చూసినంతసేపూ చూస్తూనే వున్నాడు. పది నిముషాలైంది మాట్లాడక.

కరిముల్లా ఏమీ అనలేకపోతున్నాడు.

"కరీం! నేను చేసిన పనికి నా అప్పు తీర్చు. నువ్వు పిలిపిచ్చుకున్న నేరానికి నా కొడుక్కేదైనా దారిచూపి. మా అమ్మా నాన్ననూ మా తమ్ముడు చూసుకుంటాడు. నా భార్య పుట్టింటికెళుతుంది. నువ్వు మాత్రం నాకొక మేలు చేసి వెళ్లిపో" అంటూ అర్థించాడు.

"ఏందిరా వెంకటేసు ఏందో చెప్పు. నీకన్నా నాకెవరూ ఎక్కువ కారు" అంటూ కరీం బాధపడుతున్నాడు.

"నేనొచ్చి పదకొండునెల్లు దాటింది. నేను మనూరికి వెళ్లే పరిస్థితులు లేవు. నవమి పండుగ నాకు ఎప్పుడో తెలియదు. పండగెప్పుడో కనుక్కొని నాకు ఒక్క రాములోరి పటం తెచ్చిచ్చి పుణ్యం కట్టుకో. దాన్ని చూసి ఇక్కడే ప్రాణం వదులుతా" అంటూ కరీంను కావలించుకుని లేని శక్తిని కూడదీసుకుని ఎండిపోయిన కళ్ళలోంచి బొట్లు బొట్లుగా నీళ్లు వదిలాడు.

★

